సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం ၊ 7 ၊ ఏప్రిల్ ၊ 2024



ఆరోగ్యమే మహాభాగ్యం..
వాతావరణ మార్పులు, ఇతర కారణాలతో అనారోగ్యం బారిన పడేవారు క్రమశిక్షణ పాటిస్తే మేలని వైద్యులు చెబుతున్నారు. 8లో



.. వడదెబ్బ ముప్పు
ఎండలు నానాటికీ పెరుగుతుండగా.. నిరంతరం విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు ముప్పు పొంచి ఉంది. 10లో

గరిష్టం / కనిష్టం
39° / 23°

వాతావరణం
జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రత గణనీయంగా పెరుగుతుంది. గంటగంటకూ ఎండలు పెరుగుతాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉంటుంది.



న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులకు శనివారం వైభవంగా సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కేసుల సత్వర పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టు సమావేశ మందిరంలో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ కేసు వివరాలు, వారెంట్‌లు, పెండింగ్ వారెంట్‌లు అమలు చేసే విధానంపై చర్చించారు. ప్రతి కేసులో సాక్షులను త్వరగా ప్రవేశపెట్టి తుది తీర్పునకు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బత్తుల రామారావు, రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ, ఎస్పీ రోహిత్‌రాజ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని రాధాకృష్ణమూర్తి, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెలగల నాగిరెడ్డి, రావి విజయ్‌కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

పాల్వంచ : పట్టణంలోని శ్రీనివాస గిరి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి శోభాయాత్ర(రథయాత్ర) శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి దమ్మపేట సెంటర్, బీసీఎం రోడ్, మార్కెట్ ఏరియా మీదుగా ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు తోలేటి నగేశ్ శర్మ, ఫణిరాజాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాట నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో శోభాయమానంగా యాత్ర సాగింది. కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ధర్మపురి రాము, ఊకే భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, శ్రీలత, లక్ష్మిరెడ్డి, నారాయణ, కిలారు పురుషోత్తం, సత్యనారాయణ, వెంకటేశ్వర రావు, శ్రీనివాసరావు, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్లు

అశ్వారావుపేట(ములకలపల్లి) : వేసవిలో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్‌పిట్లు, నీటి కుంటలు నిర్మించినట్లు ములకలపల్లి ఎఫ్ఆర్‌ఓ రవికిరణ్ తెలిపారు. రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ప్రత్యేకంగా 15 సాసర్‌పిట్లు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ట్యాంకర్లతో నింపామని చెప్పారు. వారానికి రెండుసార్లు నీళ్లు నింపి వన్యప్రాణుల దాహార్తి తీరుస్తామన్నారు.

కార్మిక క్షేత్రంలో ఖద్దరు పెత్తనం

సింగరేణిలో మళ్లీ రాజకీయ జోక్యం

- జీఎం బదిలీ వివాదానికి ఇదే కారణం
- ప్రతీ పనిలో పెరిగిన ప్రభుత్వ ఒత్తిడి
- తీరు మారాలంటున్న కార్మికులు, ప్రజలు



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : కార్పొరేట్ ప్రభుత్వ సంస్థగా ఉన్న సింగరేణిలో రోజురోజుకూ పెరుగుతున్న రాజకీయ జోక్యం విమర్శలకు దారి తీస్తోంది. ప్రభుత్వాలు మారినా ఖద్దరు నేతల తీరు మారకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కార్పొరేట్ సింగరేణి..

సింగరేణి ప్రభుత్వ రంగ సంస్థ. ఇందులో 49 శాతం వాటా కేంద్రానిది కాగా 51 శాతం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. ప్రభుత్వ పరంగా నిర్ణయాల్లో రాష్ట్రం మాటకే విలువ ఎక్కువ. అయితే కార్మికుల సంఖ్య, ఉత్పత్తి, పనితీరు తదితర కారణాలతో సింగరేణి ప్రత్యేక కార్పొరేషన్‌గా ఉంది. ప్రభుత్వానికి లోబడే సంస్థలో సీఎండీ, డైరెక్టర్లు, ఇతర అధికారులు పాలనా వ్యవహారాలు పర్యవేక్షిస్తారు. కార్మికుల సంక్షేమం, సంస్థ నిర్వహణ, లాభాలు తదితర అంశాల్లో సింగరేణికి స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉంది. అయితే తెలంగాణ వచ్చి, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) గుర్తింపు సంఘం హోదా పొందిన తర్వాత సింగరేణిలో జరిగే కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను పిలవాలనే విధానాన్ని అమల్లోకి తెచ్చారు. అప్పటి నుంచి ప్రజాప్రతినిధులు సంస్థ నిర్ణయాలను ప్రభావితం చేయడం మొదలైంది. ఎమ్మెల్యేలు మొదలుకుని సీఎం స్థాయి వరకు ప్రజాప్రతినిధులు సంస్థ నిర్ణయాలను ప్రభావితం చేయడం ప్రారంభమైంది. సింగరేణి సంస్థ అందించే డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్(డీఎంఎఫ్), కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్సార్) నిధులు ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నేతల ఆదేశాలకు తగ్గట్టుగా కేటాయించడం అప్పట్లో విమర్శలకు దారి తీసింది.

గత సీఎండీ వ్యవహారంలోనూ రగడ..

సీఎస్సార్, డీఎంఎఫ్‌తో పాటు సింగరేణి సంస్థ సీఎండీగా ఎన్.శ్రీధర్‌ను సుదీర్ఘ కాలం కొనసాగించడం రాజకీయంగా పెనుదుమారం లేపింది. గత ప్రభుత్వ పెద్దలకు శ్రీధర్ అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీతో పాటు కమ్యూనిస్టు పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. అనుబంధ కార్మిక సంఘాల ద్వారా న్యాయస్థానాల్లో కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా తాము అధికారంలోకి వస్తే సంస్థపై రాజకీయ జోక్యం ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇచ్చారు. సింగరేణి సంస్థ స్వతంత్రంగా వ్యవహరించేలా తమ ప్రభుత్వం నడుచుకుంటుందని చెప్పారు. కానీ అధికార పీఠం ఎక్కిన తర్వాత హామీల అమలు మాట అటుంచి, గత ప్రభుత్వం కంటే అధికంగా ప్రస్తుత ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందనే భావన కార్మికుల్లో వ్యక్తమవుతోంది.

రాజకీయ జోక్యాన్ని నివారించండి

సింగరేణి సంస్థకు 135 ఏళ్ల చరిత్ర ఉంది. బ్రిటిష్ జమానా నుంచి తెలంగాణ వచ్చే వరకు సింగరేణి దాదాపు స్వతంత్ర సంస్థగానే వ్యవహరించింది. 1990వ దశకంలో అప్పుల ఊబిలో కూరుకుపోయినప్పుడు ప్రభుత్వాలు సాయం అందించాయి. ఆ తర్వాత కార్మికులు, అధికారులు సమష్టిగా పని చేసి అప్పుల ఊబి నుంచి లాభాల బాట పట్టించారు. ఇప్పుడు బొగ్గు ఉత్పత్తితో పాటు సోలార్, థర్మల్ విద్యుత్ ఉత్పత్తిలో సింగరేణి దూసుకుపోతోంది. ఈ తరుణంలో రాజకీయ జోక్యం మితిమీరితే సంస్థ పనితీరుపై హానికర ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. అందుకే సంస్థపై రాజకీయ జోక్యాన్ని నివారించాలని సీఎం రేవంత్‌రెడ్డిని సింగరేణి ప్రాంత ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

ఖద్దరుపై ఆరోపణలు..

- సింగరేణి మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్‌గా ఉన్న దుర్గం రాంచందర్‌రావును హైదరాబాద్‌లోని సీఎండీ కార్యాలయానికి బదిలీ చేస్తూ మార్చి 11న సంస్థ ఆదేశాలు జారీ చేసింది. ఆయన స్థానంలో డి.లలిత్‌కుమార్ అనే అధికారిని మణుగూరు ఏరియా జీఎంగా నియమిస్తూ మరో సర్క్యులర్ కూడా అదే రోజు వచ్చింది. ఈ ఇద్దరు అధికారుల బదిలీలు సింగరేణిలో వివాదానికి దారి తీశాయి. రాష్ట్ర కేబినెట్‌లో కీలకంగా ఉన్న, కోల్‌బెల్ట్ ఏరియాకు చెందిన ఓ మంత్రి తన దగ్గరి బంధువుకు కీలక పోస్టు ఇప్పించుకునేందుకు సంస్థలో ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చినట్టుగా ఆరోపణలు వస్తున్నాయి. ఆ ఒత్తిళ్ల కారణంగానే మణుగూరు జీఎం బదిలీ అంటూ కార్మిక లోకం చర్చించుకుంటోంది.
- గతంలో సింగరేణిలో ఉద్యోగ నియామకపత్రాలు అధికారుల చేతుల మీదుగా కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంలో అందించేవారు. కానీ ఇటీవల కారుణ్య నియామక పత్రాలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. హైదరాబాద్ వచ్చిపోయేందుకు వీలుగా ఉద్యోగ నియామకపత్రాలు అందుకునే వారికి చార్జీలు కూడా సంస్థ చెల్లించింది.
- సింగరేణిలో రూ.వేల కోట్లతో కొత్త గనులు ప్రారంభించినా, క్వార్టర్లు నిర్మించినా సింగరేణి అధికారులే సింపుల్‌గా ఆ పనులు చేపట్టేవారు. కానీ ప్రస్తుతం ఈ పరిస్థితిలో మార్పు వస్తోంది. ఇటీవల కొత్తగూడెంలో సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఆర్భాటంగా చేయించారు.
- సింగరేణి డే మొదలు సంస్థ పరంగా ఏ కార్యక్రమం చేపట్టినా అక్కడ అధికార పార్టీ ప్రజాప్రతినిధులదే హవా అనే పరిస్థితి కొన్నేళ్లుగా నెలకొంది.

‘భద్రాద్రి’లో భగభగలు

వేసవి ఆరంభంలోనే మండుతున్న ఎండలు

- గరిమెళ్లపాడులో 44.5 సెల్సియస్ డిగ్రీలు
- రాష్ట్రంలోనే ఇది అత్యధికం
- జిల్లా వ్యాప్తంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు



నిర్మానుష్యంగా మారిన కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వేసవి ఆరంభంలోనే భద్రాద్రి జిల్లాపై భానుడు తీవ్ర ప్రతాపం చూపిస్తున్నాడు. దీంతో మే లో నమోదయ్యే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు ఏప్రిల్ మొదటి వారంలోనే వస్తున్నాయి. అనూహ్యంగా పెరిగిన ఎండలతో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రతల వివరాలను పరిశీలిస్తే.. జిల్లా కేంద్రంలో భాగంగా ఉన్న గరిమెళ్లపాడులో ఏకంగా 44.5 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఇదే అత్యధికం. గరిమెళ్లపాడు తర్వాత కొంచెం తక్కువగా అశ్వాపురంలో 44.4 సెల్సియస్ డిగ్రీలు, దమ్మపేట మండలం మల్కారంలో 44.4 సెల్సియస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో సముద్ర మట్టానికి తక్కువ ఎత్తులో ఉన్న గోదావరి బేసిన్ పరిధిలోకి వచ్చే మండలాల్లో ఎండలు దంచికొట్టాయి. గోదావరి బేసిన్‌తో పోల్చితే కృష్ణా బేసిన్ పరిధిలోకి వచ్చే ఇల్లెందు, కామేపల్లి, కారేపల్లి మండలాల్లో కాస్త నయంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

వడదెబ్బలతో బెంబేలు..

సాధారణంగా ఏప్రిల్ 15 తర్వాత నుంచి సగటు ఉష్ణోగ్రతలు 40 సెల్సియస్ డిగ్రీలకు పైగా నమోదవుతుంటాయి. అప్పటికే వేసవి తాపానికి అలవాటైన ప్రజలు మధ్యాహ్నం వేళల్లో బయటకు రాకుండా ముందుగానే పనులు ముగించుకుంటారు. మరోవైపు వేసవి తాపం నుంచి ఉపశమనం కలిగించేందుకు వైద్యారోగ్య శాఖ మొదలు స్వచ్ఛంద సంస్థల వరకు ఓఆర్ఎస్ సెంటర్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాయి. కానీ ఏప్రిల్ మొదటి వారంలోనే జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం, ఈ ఎండలకు తగ్గట్టుగా పూర్తి స్థాయిలో సన్నద్ధత లేకపోవడంతో ప్రజలు భానుడి ప్రతాపానికి బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్నం వేళ ప్రయాణాలు చేసే వారు, పనుల మీద బయటకు వచ్చిన వారు వడదెబ్బకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. గత రెండు రోజులుగా జిల్లాలో వడదెబ్బతో గురై ఆస్పత్రుల్లో చేరుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే అనవసరంగా బయటకు రావొద్దని, తరచుగా నీళ్లు తాగుతూ ఉండాలని జిల్లా వైద్యాధికారులు సూచిస్తున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి..

శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 17న భద్రాచలానికి భక్తులు పోటెత్తనున్నారు. ప్రస్తుతం పెరిగిన ఎండలను దృష్టిలో ఉంచుకుని నవమికి ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. మరోవైపు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇన్ పేషెంట్లుగా ఉన్న వారు వేసవి తాపానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రితో పాటు మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట ఆస్పత్రుల్లో అత్యవసర విభాగాల్లోనూ ఫ్యాన్లే దిక్కుగా ఉన్నాయి. వీటి నుంచి వచ్చే వేడి గాలికి రోగులు అల్లాడిపోతున్నారు. వారికి ఉపశమనం కలిగేలా కనీసం అత్యవసర నిధులు వెచ్చించి అయినా ఏసీలు, కూలర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరతున్నారు. ఇక సింగరేణి విస్తరించి ఉన్న ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరులో ఉపరిత గనుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే తీరుగా ఉష్ణోగ్రతలు పెరిగితే పే డే అమలు చేయాలంటున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోకి వ్యాపారులను అనుమతించొద్దు

డీసీఓ ఖుర్షీద్

అన్నపురెడ్డిపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ప్రైవేట్ వ్యాపారులను అనుమతిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి(డీసీఓ) ఖుర్షీద్ హెచ్చరించారు. ‘ధాన్యం కొనుగోళ్లలో ఇష్టారాజ్యం’ శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన డీసీఓ.. మండలంలోని నామవరం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సందర్శించారు. కేంద్రం వద్ద సరైన వసతులు లేకపోవడం, ప్రైవేట్ వ్యాపారుల ధాన్యం బస్తాలు ఉండడంతో సంబంధిత నిర్వాహకుడికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని చెప్పారు.

నవమికి పటిష్ట ఏర్పాట్లు చేయండి

అధికారులకు కలెక్టర్ ప్రియాంక అల ఆదేశం




వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): శ్రీరామనవమికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం శ్రీరామనవమి, మహా పట్టాభిషేక కార్యక్రమాల నిర్వహణపై అన్ని శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. కల్యాణ వేడుకలు నిర్వహించే మిథిలా స్టేడియాన్ని 26 సెక్టార్లుగా విభజించామని, ప్రతి సెక్టార్‌కు ఒక ప్రత్యేకాధికారిని నియమించామని చెప్పారు. భక్తులు ఒక సెక్టార్ నుంచి మరో సెక్టార్‌కు వెళ్లకుండా పటిష్ట బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రతి సెక్టార్‌లో కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల వసతి సౌకర్యం కోసం లాడ్జీలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా 1,330 టికెట్లు విక్రయించినట్లు చెప్పారు. మహోత్సవ విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేకంగా గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. 17, 18 తేదీల్లో భద్రాచలంలో మాంసం, మద్యం విక్రయాలు నిలిపి వేయాలని ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని డీపీఓకు సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో 08743–232444 నంబర్‌తో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తాగునీటి సరఫరాకు 200 కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల వాహనాల పార్కింగ్‌కు ఐదు ప్రాంతాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, నాటు పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అత్యవసర వైద్య సేవలకు ప్రభుత్వ ఆస్పత్రిలో 20 బెడ్లు సిద్ధంగా ఉంచాలని, ఐసీయూ వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం ఆర్టీసీ రూపొందించిన సీతారామ కల్యాణ తలంబ్రాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, డీఆర్‌డీఓ విద్యాచందన, దేవస్థానం ఈఓ రమాదేవి, డీఆర్‌ఓ రవీంద్రనాథ్, ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు పాల్గొన్నారు.

హామీలన్నీ అమలు చేయాలి

- ప్రభుత్వ వైఫల్యంతోనే రైతులకు కష్టాలు
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



నిరసన దీక్షలో రేగా కాంతారావు, నాయకులు

మణుగూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు డిమాండ్ చేశారు. హామీలు నిలబెట్టుకోవాలనే డిమాండ్‌తో పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేపట్టారు. అనంతరం ప్రదర్శనగా వెళ్లి తహసీల్దార్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ.. హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఆ పార్టీ 100 రోజుల పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, సాగు నీరు లేక పొలాలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ఒక్క మంత్రి కూడా మరణించిన రైతు కుటుంబాలను పరామర్శించలేదని, ఎండిన పొలాలను సందర్శించలేదని ఆరోపించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, రైతుబంధు రూ.15వేలు, ధాన్యం, మొక్కజొన్నకు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు జరిగేంతవరకూ తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నర్సింహారావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ముత్యంబాబు, అడపా అప్పారావు, పినపాక ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఆత్మ కమిటీ చైర్మన్ పి.భద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్లు కుర్రి నాగేశ్వరరావు, రవిశేఖర్ వర్మ, అశ్వాపురం, పినపాక, కరకగూడెం మండలాల అధ్యక్షులు కోడి అమరేందర్, పి.సతీష్‌రెడ్డి, ఆర్.సోమయ్య, నాయకులు వట్ట రాంబాబు, తాళ్లపల్లి యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

బ్యాంబూ క్లస్టర్ !





వెదురుతో తయారుచేసిన గృహ అలంకరణలు
(ఇన్‌సెట్) వెదురుతో తయారుచేసిన నెమలి

- బెండాలపాడులో కేంద్రం ఏర్పాటు
- వెదురు ఉత్పత్తుల తయారీలో శిక్షణ
- జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ చేయూత
- ఆదివాసీల గ్రామంలో కొత్త వెలుగులు
- త్వరలోనే అమ్మకాలకు శ్రీకారం

సండే స్పెషల్

చంద్రుగొండ: ఆదివాసీలకు పోడు వ్యవసాయం మినహా మరెలాంటి ఉపాధి కనుచూపు మేరలో కనిపించదు. వ్యవసాయ సీజన్లు ముగిశాక కూలీ పనులకు వెళ్లడం.. వచ్చిన డబ్బుతో పొట్ట పోసుకోవడమే వారికి తెలుసు. ఇతరత్రా ఉపాధి మార్గాలపై అవగాహన లేక పేదరికంలో మగ్గుతున్నారు. ఈ నేపథ్యాన ఆదివాసీలకు విభిన్న రంగాల్లో శిక్షణ ఇచ్చిన ఇచ్చి ఉపాధి కల్పించేందుకు జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా చంద్రుగొండ మండలం మారుమూల గ్రామమైన బెండాలపాడులో ఆదివాసీల స్థితిగతులను మెరుగుపరిచేందుకు బ్యాంబూ క్లస్టర్ ఏర్పాటు చేశారు. ఈ మేరకు వీరికి వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చి అమ్మకానికి ఏర్పాట్లు చేయడం ద్వారా ఆర్థిక స్థితిగతులు మార్చడమే లక్ష్యంగా కృషి జరుగుతోంది.

దట్టమైన అటవీ ప్రాంతం..

బెండాలపాడు గ్రామ శివారులోని కనకగిరి గుట్టల్లో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతానికి చెందిన ఆదివాసీలు ఇన్నాళ్లూ వెదురుతో తడికెలు, బుట్టలు అల్లి వాటిని అమ్ముతూ జీవనం సాగించారు. కానీ మారిన పరిస్థితుల్లో వెదురు సేకరించేందుకు ఆదివాసీలకు చట్టపరమైన చిక్కులు వస్తున్నాయి. అంతేకాక వెదురు తడికెలకు ప్రస్తుతం మార్కెట్‌లో అంతగా డిమాండ్ లేదు. ఈ నేపథ్యాన ఈ ఏడాది జనవరిలో బ్యాంబూ క్లస్టర్ మంజూరు చేయగా.. వెదురుతో ఇళ్లలో అలంకరణ వస్తువులు, ఇతర సామగ్రి తయారీపై శిక్షణ ఇస్తుండడంతో ఆదివాసీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

ఉత్పత్తులు ఇలా..



డైనింగ్ టేబుల్ సిద్ధం చేస్తున్న తయారీదారులు

స్టీల్‌తోపాటు ప్లాస్టిక్, ఫైబర్‌తో తయారయ్యే ఉత్పత్తులే ఎక్కువగా ఇళ్లు, వ్యాపార సంస్థల్లో వాడకంలో ఉన్నాయి. వీటితో రకరకాల సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యాన వెదురుతో చేసే వస్తువులతో ఎవరికీ ముప్పు లేకపోగా.. ఆదివాసీలకు ఉపాధి లభించనుంది. వెదురుతో డైనింగ్ డేబుళ్లు, మంచాలు, కుర్చీలే కాక గృహ అలంకరణ వస్తువులు తయారు చేస్తుండడం విశేషం. త్వరలోనే వీటి అమ్మకానికి చంద్రుగొండలో ఏర్పాట్లు చేస్తుండగా.. జిల్లా కేంద్రంతో పాటు భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోనూ స్టాళ్ల ఏర్పాటుకు అనుమతించాలని అధికారులను ఆదివాసీలు కోరుతున్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ఆన్ బ్యాంబూ

గ్రామానికి చెందిన పల్లేరు వీరభద్రం గిరిజన స్వచ్ఛంద సంస్థ కృషితో ఇక్కడ జాతీయ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ బ్యాంబూ క్లస్టర్ మంజూరు చేసింది. రూ.1.50 కోట్లతో షెడ్డు నిర్మించగా.. మిషనరీలు సైతం ఏర్పాటు చేశారు. ప్రకృతి స్వచ్ఛంద సంస్థ, టెక్నికల్ ఏజెన్సీ(రెయిన్‌బో) సహకారంతో పది మంది డైరెక్టర్లను ఎన్నుకుని కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సంఘంలో 837 మంది సభ్యులను చేర్పించగా.. ఆదిలాబాద్‌కు చెందిన హస్తకళా నిపుణులను పిలిపించి వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్నారు. కేవలం ఆదివాసీలకే కాకుండా సభ్యులుగా ఎవరు చేరినా వారికి శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 50 నుంచి 100 మంది వరకు శిక్షణకు హాజరవుతూ ఉత్పత్తుల తయారీ, మెళవకులు నేర్చుకుంటున్నారు.

ఆదివాసీలు ఆర్థికంగా బలపడాలని..



పేద ఆదివాసీలు ఆర్థికంగా బలపడాలన్నదే మా లక్ష్యం. వివిధ సంస్థలు, కేంద్రం సహకారంతో బ్యాంబూ క్లస్టర్ ఏర్పాటైంది. ఆదివాసీలు వెదురు ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం సాధిస్తున్నారు. ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే మా లక్ష్యం నెరవేరుతుంది.
– ఈసం నాగభూషణం, క్లస్టర్ చైర్మన్, బెండాలపాడు

మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి



వెదురు ఉత్పత్తులకు రాష్ట్రప్రభుత్వం మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. ఈ విషయమై రాష్ట్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేయనున్నాం. మార్కెటింగ్ ఉంటే మరిన్ని ఉత్పత్తులను తయారుచేయగలం. ఆదివాసీలు ఆర్థికంగా బలపడడం సాధ్యమవుతుంది.
– బొర్రా సురేష్, డైరెక్టర్, బెండాలపాడు

శక్తివంచన లేకుండా కృషి



మా గ్రామంలో బ్యాంబూ క్లస్టర్ ఏర్పాటు అనేది అనుకోకుండా వచ్చిన అవకాశం. దీంతో శక్తివంచన లేకుండా ఉత్పత్తుల తయారీ, మెళకువలు నేర్చుకుంటున్నాం. మా కష్టం ఫలిస్తుందనే ఆశ ఉన్నా.. ప్రభుత్వ సహకారం కూడా కావాలి.
– కారం అన్వేష్,డైరెక్టర్, బెండాలపాడు

క్లుప్తంగా

భద్రాద్రి విద్యార్థికి 'సీవీ రామన్' అవార్డు



అవార్డు అందజేస్తున్న చంద్రబోస్, నిర్వాకులు

భద్రాచలంటౌన్: పట్టణానికి చెందిన గట్టుపల్లి ప్రణవ్‌సాయి నిదర్శన్‌కు సుచిరిండియాస్ 31వ సీవీ రామన్ యంగ్ జీనియస్ అవార్డు లభించింది. హైదరాబాద్ పంజాగుట్టలోని శ్రీసాయి నిగమ్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ చేతుల మీదుగా బహుమతిని ప్రణవ్‌సాయినిదర్శన్ అందుకున్నారు. స్థానిక త్రివేణి స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

నటుడికి సన్మానం


విజయ్‌వర్మను సత్కరిస్తున్న సింగపూర్ నాలెడ్జ్ ప్రతినిధులు

దుమ్ముగూడెం: మండలంలోని చెరుపల్లికి చెందిన సినీ దర్శక, నిర్మాత, నటుడు, ఫిలిం, టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ అఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి పాకలపాటి విజయ్‌వర్మను సింగపూర్ నాలెడ్జ్ హబ్ బాధ్యులు సన్మానించారు. ఆయన నేతృత్వాన సినీ ప్రతినిధుల బృందం శ్రీలంకలో ఇటీవల ఇండో – సింగపూర్ ఫిలిం అండ్ టూరిజం ఎక్స్‌చేంజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సినిమాల రూపకల్పనలో ఉపయోగించే సాంకేతిక అంశాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడంతో పాటు పర్యాటక రంగ అభివృద్ధి కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా విజయ్‌వర్మ నేతృత్వం వహించారు. కార్యక్రమంలో సింగపూర్ నాలెడ్జి హబ్ ప్రతినిధులు అడ్రియన్ ఓయ్, షియోబాన్ ఇసోబెల్, నరేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన ప్రతుల ఆవిష్కరణ


ఆహ్వానప్రతులను ఆవిష్కరిస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం వేదికగా ట్రూ టాలెంట్ సింగర్స్ గ్రూప్, భద్రాద్రి మెలోడి సింగర్స్ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కళాకారులచే అహోబిల మఠంలో ఈ నెల 24న నిర్వహించే సంగీత స్వరార్చన ఆహ్వానప్రతులను రామాలయ ఈఓ రమాదేవి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భద్రాద్రిలో కర్ణాటక శాస్త్రీయ సంగీత ప్రదర్శనను వీక్షించే అవకాశాన్ని ఇక్కడి ప్రజలకు కల్పించిన నిర్వాహకుల కృషి అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమానికి హాజరై కళాకారుల ప్రదర్శనలను తిలకించి విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంకొండ దుర్గాకోమలి, జేఆర్ మూర్తి, గోళ్ల భూపతిరావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాచందన

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం గట్టుమల్ల పంచాయతీ పరిధిలో గొత్తికోయ గ్రామంలో ఉన్న గంగమ్మకాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ విద్యాచందన సందర్శించారు. లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం సరుకుల నాణ్యత పరిశీలించారు. ఆమె వెంట పీవీ చలపతి, అశోకకుమారి, జ్యోతి, సోడి గంగయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీజీవోస్ ఆధ్వర్యాన ఇఫ్తార్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం 6గంటలకు ముస్లిం ఉద్యోగులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి తెలిపారు. ఖమ్మం కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగే ఇఫ్తార్‌కు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, ఎ.సత్యనారాయణతో పాటు టీఎన్జీవోస్, నాలుగో తరగతి, పంచాయతీరాజ్ మినిస్టీరియల్, సీపీఎస్ తదితర సంఘాల బాధ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈమేరకు ఉద్యోగులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

ఆరోగ్యమే మహాభాగ్యం..

- జిల్లాలో విస్తరిస్తున్న మధుమేహం
- రక్తపోటు కేసుల సంఖ్యా ఎక్కువే..
- మంచి అలవాట్లతో ఆరోగ్యంగా ఉండొచ్చంటున్న వైద్య నిపుణులు

నేడు ప్రపంచ ఆరోగ్యదినోత్సవం



పాల్వంచరూరల్: మంచి అలవాట్లతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కారణాలతో ఎంతటి వారైనా అనారోగ్యం దరిచేరకుండా ఉండలేకపోతున్నారు. పని ఒత్తిడి, పర్యావరణ అసమతుల్యత, కాలుష్యం పెరిగిపోవడం, కలుషిత ఆహారం తదితరాలు మానవుడి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అయితే, అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని, రోజువారి ఆహారంలో మార్పులు, క్రమశిక్షణ పాటిస్తే ఆరోగ్యంగా జీవించవచ్చని నిపుణులు చెబుతున్నారు. మూడేళ్ల కిందట మానవాళిని వణికించిన కరోనా మహమ్మారి తర్వాత అందరి ఆరోగ్యం దెబ్బతిన్నది. ప్రతి ఒక్కరూ ఏదో సమస్యతో సతమతమవుతూనే ఉన్నారు. జీవనశైలిలో వ్యాయామం లేకపోవడం, సమయానికి భోజనం చేయకపోవడం, నిద్రలేమి, మద్యం, పొగతాగడం, ఒత్తిడికి గురికావడంతో గుండెపోటు సంభవిస్తోందని వైద్యులు అంటున్నారు. ప్రధానంగా మధుమేహం (షుగర్), రక్తపోటు, కిడ్నీ సమస్యలు, స్థూలకాయం వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కథనం..

మధుమేహం, బీపీ పెరుగుతున్నాయి..

జిల్లాలోని ఏజెన్సీ ప్రజల జీవనశైలి కారణంగా మధుమేహం బాధితుల సంఖ్య పెరుగుతోంది. పాతికేళ్లు దాటిన చాలామందిలో మధుమేహం గుర్తించామని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా మధుమేహం వ్యాధి బారిన పడిన వారు రెండు లక్షలకు పైగా ఉన్నట్లు అంచనా. మధుమేహం, రక్తపోటు రావడానికి శారీరక శ్రమ లేకపోవడం, కొవ్వు పదార్థాలున్న ఆహారాలను అధికంగా తీసుకోవడం, మానసిక ఒత్తిడి, మద్యపానం, ధూమపానం లాంటి వ్యసనాలే మూలకారణమని నిపుణులు చెబుతున్నారు. వంశపారంపర్యంగా యుక్త వయసులోనే కొందరు రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నట్లు తేలింది. ఇదిలా ఉండగా 18 ఏళ్లు నిండిన వారిలో సగటున 20 శాతం మంది అధిక రక్తపోటు బాధితులు ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. రక్తపోటు బాధితులు జిల్లాలో 61,165 మంది ఉండగా.. 32,025 మంది మధుమేహం బారిన పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఇలా చేస్తే మేలు..

ఎంత పనిఒత్తిడి ఉన్నా కూడా రోజులో 45 నిమిషాలు (ఆపకుండా) కనీసం నడవాలని నిపుణులు చెబుతున్నారు. దీంతో దేహంలోని జీవక్రియలన్నీ సక్రమంగా ఉండటంతో పాటు ఎక్కువ మోతాదులో ఉన్న కేలరీలు కరిగిపోతాయంటున్నారు. రోజూవారి ఆహారంలో తాజా కూరగాయలు, ఆకుకూరలు, ఉడికించిన గుడ్లు, పప్పులు ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. మద్యపానం, ధూమపానం లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి.

అవగాహన కల్పిస్తున్నాం..


ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తాం. ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తాం. ప్రజలు కూడా మంచి ఆహారపు అలవాట్లు పాటిస్తే ఆరోగ్యంగా ఉండొచ్చు.

– శిరీష, డీఎంహెచ్‌ఓ

చెడు అలవాట్లు మానుకోవాలి..


జీవనశైలిలో ప్రతి ఒక్కరూ వయస్సుకు తగిన విధంగా అలవాట్లను అలవర్చుకోవాలి. ప్రతిరోజు నడక, చిన్నపాటి వ్యాయామం చేయాలి. తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. ఆకుకూరలు, పండ్లు, పాలు అధికంగా తీసుకుంటే రక్తంలో సుగర్ మోతాదు పడిపోదు.

– డాక్టర్ రాజు, పీహెచ్‌సీ, జగన్నాథపురం

బస్సు లేక విద్యార్థుల అవస్థలు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని సింగరేణి యాజమాన్యం
- 40 డిగ్రీల నడుచుకుంటూ ఇంటికి..


ఎండలో కాలినడకన వెళ్తున్న విద్యార్థులు


ఆటోలు లేక వేచిచూస్తున్న విద్యార్థులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. స్కూల్ బస్సులకు వారం కిందటే టెండర్ ముగిసింది. కానీ, బస్సు లేకపోవడంతో విద్యార్థులను తరలించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంపై తల్లిదండ్రులు, కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీవీకాలనీలో నిర్వహిస్తున్న సింగరేణి హైస్కూల్‌కు మణుగూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి సుమారు 200 మందికి పైగా బస్సుల్లో వచ్చి విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థులను స్కూల్‌కు తరలించే బస్సు టెండర్ మార్చి 31కే ముగిసింది. అప్పటినుంచి స్కూల్ ముగిసిన తర్వాత కొందరు కాలినడకన 2 కిలోమీటర్లు నడిచి ఆటోలు ఎక్కి వెళ్తుండగా, మరికొందరు మణుగూరు నుంచే ఆటోలు మాట్లాడుకుని పాఠశాలకు వస్తూ వెళ్తున్నారు. కొందరు తల్లిదండ్రులు మధ్యాహ్నం మోటార్‌సైకిళ్లపై తీసుకెళ్తున్నారు. తాజాగా ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో 40 డిగ్రీల ఎండలో పిల్లలను ఎలా తీసుకెళ్లాలంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యా సంవత్సరాన్ని పరిగణనలోకి తీసుకుని యాజమాన్యం టెండర్లు నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఎండలో వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందని సింగరేణి ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, రాజనర్సు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్ నిర్వహించి పూర్తిస్థాయిలో బస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. హెచ్‌ఎం స్వరూపను వివరణ కోరగా, పర్చేజ్ డిపార్ట్‌మెంట్ అధికారి సెలవులో ఉండటం వల్ల విద్యార్థుల రాకపోకలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదని, తాము ఉద్యోగులం మాత్రమేనని సమాధానమిచ్చారు.

అనుమతులు లేని ఆస్పత్రులపై కొరడా..


ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

బూర్గంపాడు: ప్రభుత్వ అనుమతులు, రిజిస్ట్రేషన్లు లేకుండా ఇష్టానుసారంగా నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులపై జిల్లా వైద్యారోగ్యశాఖ కొరడా ఝుళిపించింది. పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న అంజలి ఆస్పత్రిని శనివారం డీఎంహెచ్‌ఓ శిరీష ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ పత్రాలు లేకపోవటంతో గతంలోనే ఈ ఆస్పత్రికి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కింద షోకాజ్ నోటీసులు జారీ చేశారు. షోకాజ్ నోటీసులకు సమాధానం ఇవ్వకుండా యథావిధిగా ఆస్పత్రిని నిర్వహిస్తున్న క్రమంలో శనివారం ఆస్పత్రిని, ల్యాబ్‌ను సీజ్ చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ శిరీష తెలిపారు. తనిఖీల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఫైజ్ మోహిద్దీన్, హెల్త్ ఎడ్యుకేటర్ బేబీ పాల్గొన్నారు.

పల్లె ప్రకృతివనాలకు నిప్పపెట్టిన దుండగులు

అగ్నికి ఆహుతైన వేలాది మొక్కలు


కాలిపోయిన పెద్దకోరుకొండిలోని పల్లెప్రకృతి వనం


చిన్నకోరుకొండి బృహత్ ప్రకృతివనం..

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి, పెద్దకోరుకొండిల్లో పల్లెప్రకృతి వనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో వేలాది మొక్కలు, చెట్లు కాలిపోయాయి. చిన్నకోరుకొండిలోని బృహత్ ప్రకృతివనంలో శుక్రవారం రాత్రి నిప్పు పెట్టగా ఎకరన్నర విస్తీర్ణంలో పూల మొక్కలు, చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే, పెద్దకోరుకొండి పల్లె ప్రకృతి వనానికి కూడా అదే సమయాన నిప్పు పెట్టగా పూలు, పండ్ల మొక్కలు కాలిపోయాయి. మంటలు చెలరేగుతుండడంతో గుర్తించిన స్థానికులు గ్రామపంచాయతీ సిబ్బందికి సమాచారం ఇవ్వగా..వారు సత్తుపల్లి అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేయడంతో సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు ఆర్పారు. కాగా, ప్రకృతి వనాలను ఈజీఎస్ ఏపీఎం హేమమాలిని, ఏఈ పుల్లారావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు శనివారం పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

తలనీలాల డబ్బులేవి తల్లీ..?

పాల్వంచరూరల్ : మండలంలోని కేశవాపురం జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన పెద్దమ్మతల్లి ఆలయం రెగ్యులర్ ఈఓ రజనీకుమారి సెలవులో వెళ్లడంతో నెల రోజుల క్రితం ఇన్‌చార్జ్ ఈఓగా సుదర్శన్ బాధ్యతలు స్వీకరించారు. అయితే ఆయనకు ఇతర దేవాలయాల బాధ్యతలు కూడా ఉండటంతో పెద్దమ్మగుడిపై సరైన దృష్టి పెట్టడం లేదు. దీంతో ఆలయ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో.. ఆలయంలో తలనీలాల కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి ఆలయానికి రూ.12 లక్షలు చెల్లించకుండానే వెళ్లిపోయినా పట్టించుకునే వారు లేరనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో కాంట్రాక్ట్ దక్కించుకున్న భద్రాచలానికి చెందిన జై శ్రీరాం అనే వ్యక్తి టెండర్ దక్కించుకున్నాడు. చెల్లించాల్సిన మొత్తం రూ.24 లక్షలు కాగా, రూ.12 లక్షలు మాత్రమే చెల్లించి ఏడాది పాటు తలనీలాలను పోగుచేసుకుని వెళ్లిపోయాడు. గడువు లోగా మిగితా డబ్బు చెల్లించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చేయడంతో సగం చెల్లించకుండా వెళ్లిపోగా, దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2005 – 06 సంవత్సరంలో కూడా కొబ్బరికాయల వేలం దక్కించుకున్న మహిళా కాంట్రాక్టర్ సుమారు రూ.8 లక్షలు చెల్లించకుండా వెళ్లిపోయిన దాఖలాలు ఉన్నాయి. ఈ ఘటనపై ఇన్‌చార్జ్ ఈఓ జి.సుదర్శన్‌ను వివరణ కోరగా.. తలనీలాల టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ రూ.12 లక్షలు చెల్లించకుండా వెళ్లాడని, అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసి డబ్బు వసూలు చేస్తామని చెప్పారు.

యువకుడి మృతదేహం యూపీకి తరలింపు

ఖమ్మంఅర్బన్: ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులతో మృతి చెందిన మార్బుల్ వర్కర్ వినయ్ మృతదేహాన్ని ఆయన స్వస్థలమైన ఉత్తరప్రదేశ్‌కు శనివారం సాయంత్రం తరలించారు. ద్విచక్ర వాహనం ఈఎంఐ చెల్లించలేదని వినయ్‌ను ప్రైవేట్ ఫైనాన్స్ ఏజెంట్లు వేధిస్తుండగా పారిపోయే క్రమంలో శుక్రవారం కర్రలు, రాళ్లతో కొడుతూ వెంబడించగా ఆయన భయంతో చెరువులో పడి మృతి చెందిన విషయం విదితమే. ఆయన మృతదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తయ్యాక ఖమ్మంలో ఉంటున్న వినయ్ సోదరుడు స్వస్థలానికి అంబులెన్స్ ద్వారా తరలించారు. కాగా, అంబులెన్స్ ఖర్చులు ఫైనాన్స్ కంపెనీ వారే చెల్లించినట్లు తెలిసింది. కేసులో నిందితులైన అజయ్‌కుమార్, రామచంద్రును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కాగా, వేధింపులకు పాల్పడుతున్న ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో కార్మిక సంఘాల నాయకులు పోలీస్‌స్టేషన్ వద్ద కొద్దిసేపు నిరసన తెలిపారు.

మద్యం మత్తులో పాఠశాల గదికి నిప్పు

కాలిపోయిన టీవీ, ఫర్నీచర్, ఆట పరికరాలు, రికార్డులు


పాఠశాలలో కాలిన ఫర్నీచర్

నేలకొండపల్లి: మద్యం మత్తులో కొందరు యువకులు పాఠశాల స్టోర్ గదికి నిప్పు పెట్టారు. దీంతో ఆ గదిలోని టీవీ, ఫర్నీచర్‌తో పాటు ఆట వస్తువులు, రికార్డులు కాలిపోయాయి. వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం బైరవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని స్టోర్ గదిలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. శనివారం మధ్యాహ్న భోజనం వండేందుకు వచ్చిన నిర్వాహకులు గది తలుపులు తీయగా ఈ విషయం బయటపడింది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వరరావు పరిశీలించగా.. సమీపాన మద్యం సీసాలు, సిగరెట్ పీకలు ఉండడంతో ఆకతాయిలు మద్యం తాగిన మైకంలో స్టోర్ గది కిటికిలో నుంచి నిప్పు వేసినట్లు గుర్తించారు. దీంతో మంటలు అలుముకొని సుమారు రూ.40 వేల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే, ఘటనా స్థలాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శి కె.నాగేశ్వరరావు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని మొద్దులగూడెం – గుర్రాలచెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను శనివారం అధికారులు పట్టుకున్నారు. అనుమతులు లేకపోవడంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. ట్రాక్టర్‌ను సీజ్ చేశామని తహసీల్దార్ కృష్ణప్రసాద్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

అశ్వారావుపేటరూరల్: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి పంచాయతీ కొత్తూరు గ్రామ సమీపంలోని పెదవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని వల్లెపు దుర్గాప్రసాద్, డ్రైవర్ వల్లపు జగదీశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నిల్వ ఉన్న ఇసుక సీజ్

పాల్వంచరూరల్ : పాల్వంచ పట్టణ పరిధిలోని గుడిపాడు – కుంటినాగులగూడెం, పరిసర ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు ఏడు లారీల ఇసుకను శనివారం రాత్రి సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీనిపై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

నంబర్ ప్లేట్లు లేని వాహనదారులపై కేసు

భద్రాచలంఅర్బన్: పట్టణంలో తిరుగుతున్న పలు వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకపోవడంతో వాటిని అదుపులోకి తీసుకొని యజమానులపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు. భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్ ఆదేశాల మేరకు పట్టణంలో వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను ఆపి తనిఖీ చేశారు. యజమానులపై చీటింగ్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు సమీపాన కాశీపట్నం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పిండిప్రోలు గ్రామానికి చెందిన ఐతనబోయిన వెంకటేశ్వర్లు(68) భార్య లేకపోవడంతో కాశీపట్నంలోని దేవాలయం వద్ద ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెలవారుజామున ఆయన రహదారిపై నడిచి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వెంకటేశ్వర్లును ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాద సంఘం ఎన్నికలకు నామినేషన్లు

ఖమ్మం లీగల్: జిల్లా న్యాయవాదులు సహకార సంఘంలో నాలుగు డైరెక్టర్ పదవులకు నిర్వహించనున్న ఎన్నికకు శనివారంతో నామినేషన్ ప్రక్రియ ముగిసింది. ఈనెల 16న ఖమ్మం బార్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నిక నిర్వహించి అదేరోజు ఫలితాలు వెల్లడిస్తారు. కాగా, అనుమోలు నర్సింహారావు, భూక్యా రమేష్, పలివల శ్రీలక్ష్మి,గోరింట్ల శాంతరావు, చుంచుల మల్లికార్జునరావు, దేవకి శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలు చేయగా, విత్‌డ్రా అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులను ఈనెల 10న ప్రకటిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై కేసు


భాస్కరాచారి

అశ్వాపురం: మండలంలో ఇద్దరు వ్యక్తులు కనిపించకుండా పోయిన ఘటనలపై శనివారం అశ్వాపురం పోలీసులు కేసులు నమోదు చేశారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వివాహిత (40) గత నెల 20న ఇంటోల నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె భర్త వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సురేశ్ కేసు నమోదు చేశారు. జగ్గారం గ్రామానికి చెందిన కార్పెంటర్ కత్రోజు భాస్కరాచారి (35) కొద్ది రోజుల కిందట ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆయన కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేటీపీఎస్ కాలనీలో దొంగల హల్‌చల్

పాల్వంచ: కేటీపీఎస్ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ క్వార్టర్ తాళాలను గుర్తుతెలియని దుండగులు పగులగొడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు. స్థానికుల కథనం మేరకు..కేటీపీఎస్-ఏ కాలనీలో రాధాకృష్ణ గుడి లైన్‌లో ఓ ఇంటి తాళాలను ఓ పురుషుడు, మహిళ కలిసి వచ్చి పగులగొడుతుండగా స్థానికులు గుర్తించి పట్టుకుని, పోలీసులకు అప్పగించారు.

ముత్యాలమ్మ గుడిలో చోరీ

పెనుబల్లి: పెనుబల్లిలోని ముత్యాలమ్మ గుడిలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేశాక లోనికి ప్రవేశించి రెండు హుండీలు, బీరువాలను పగులగొట్టారు. హుండీల్లో రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ఉన్న కానుకలను ఎత్తుకెళ్లారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఇద్దరు దుండగులు గడ్డపారతో ఆలయంలోకి ప్రవేశించినట్లు సీసీ కెమెరాల్లో నమోదు కాగా, వీఎం బంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం అపహరణ

సత్తుపల్లిటౌన్: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ఓ ద్విచక్ర వాహనాన్ని ఆగంతకులు చోరీ చేశారు. సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలోని రోడ్డు నంబర్ 8కి చెందిన గులాం మతీన్ తన రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని గురువారం రాత్రి ఇంటిముందు పార్కింగ్ చేసి నిద్రించాడు. శుక్రవారం ఉదయం లేచి చూడగా.. వాహనం కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించి సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మోసానికి మారుపేరు

అబద్ధాలు, వెన్నుపోటు, మోసం, కుట్రలు కలిపితే చంద్రబాబు

కావలి బహిరంగ సభలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: 'మోసం, అబద్ధాలు, వెన్నుపోట్లు, కుట్రలు.. ఈ పాత్రలన్నీ కలిపితే చంద్రబాబు. సినిమాల్లో విలన్ క్యారెక్టర్లలో మనకు నచ్చనివన్నీ కలిపితే పుట్టే కొత్త క్యారెక్టర్ అన్నమాట. ఈ క్యారెక్టర్.. చంద్రబాబును నాలుగు నెలలుగా నేను కొన్ని ప్రశ్నలు అడుగుతున్నా. 14 ఏళ్లు సీఎంగా చేశావు.. 3 సార్లు సీఎంగా చేశానని చెప్పుకుంటావు. మరి నీ పేరు చెబితే పేదలకు గుర్తుకొచ్చే పథకం కనీసం ఒక్కటంటే ఒక్కటైనా ఉందా? నువ్వు చేసిన మంచి పని ఏదైనా ఉందా? మీ ముందే, మీ సమక్షంలో.. ఇలా సిద్ధం సభల్లో లక్షలాది మంది ముందు ఇప్పటికే ఎన్నోసార్లు అడిగాను. నాకైతే సమాధానం చెప్పలేదు.మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శనివారం ఆయన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి బహిరంగ సభలో మాట్లాడారు. ఐదు వారాల్లో జరగనున్న ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును, మన పేదల ఇంటింటి భవిష్యత్తును నిర్ణయించేవని, కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎన్నుకునేవి మాత్రమే కాదని గుర్తుంచుకోవాలని చెప్పారు. మీ ఓటు ఐదేళ్ల కాలంలో మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందన్నారు.

బాబు చేతిలో కీలుబొమ్మ సునీత

- 2019లో కడప ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌ను ఖరారు చేసిన వైఎస్ జగన్
- అవినాశ్ గెలుపు కోసం చివరి వరకూ కృషి చేసిన వివేకా
- అయినా కొన్నేళ్లుగా సునీత దుష్ప్రచారం
- తాజాగా పులివెందుల ఉప ఎన్నికల అభ్యర్థిత్వంపై అవాస్తవాలు
- హేతుబద్ధ ప్రశ్నలు సంధిస్తే సమాధానం కరువు
- వివేకా రెండో వివాహంతోనే ఆ కుటుంబంలో విభేదాలు

ఏపీ వార్తలు, వివరాల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అన్నదాత భగీరథ ప్రయత్నం!



సాగర్ బ్యాక్ వాటర్ వెనక్కి వెళ్లిపోవడంతో నీటిని పంటలకు తరలించేందుకు పెద్దవూర మండలం పాల్తితండా రైతులు తవ్విన బావి



మోటార్లతో నీటిని తరలించేందుకు కిలోమీటర్ల పొడవున రైతులు వేసుకున్న పైప్‌లైన్లు

- నల్లగొండ జిల్లాలో పంటలను కాపాడుకోవడానికి రైతుల తంటాలు
- సాగర్ జలాశయం అడుగంటడంతో బ్యాక్ వాటర్‌లో తేలిన భూములు
- వాటిల్లో బావులు తవ్వి, 8 కి.మీ. దాకా పైపులు వేసి నీటి తరలింపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఆరుగాలం శ్రమించి వేసుకున్న పంటలను కాపాడుకొనేందుకు రైతులు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. కళ్ల ముందే ఎండిపోతున్న పంటలను బతికించుకొనేందుకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు. కరువు కారణంగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోవడంతో పంటలను ఎలాగైనా కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టులో ఇప్పటికే వేల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోగా సాగర్ బ్యాక్ వాటర్ కింద సాగు చేసుకుంటున్న రైతులు పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. ముఖ్యంగా బత్తాయి, మామిడి వంటి పండ్ల తోటలతోపాటు వేరుశనగ, వరి పంటలను బతికించుకొనేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. ముఖ్యంగా సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరడంతో బ్యాక్ వాటర్ కిలోమీటర్ల మేర తగ్గిపోయింది. దీంతో నల్లగొండ జిల్లా పీఏ పల్లి మండలంలోని నంబాపురం, పెద్దగట్టు, పుట్టంగండి తదితర ప్రాంతాల్లో గిరిజన రైతులు పంటకు నీరందించేందుకు కిలోమీటర్ల పొడవునా పైపులైన్లు వేసుకొని మోటార్లు పెట్టి నీటిని తరలిస్తున్నారు. పెద్దవూర మండలం పాత్తితండా, పర్వేదుల తదితర గ్రామాల రైతులు పదుల సంఖ్యలో సాగర్ వెనుక జలాశయంలోని లోతట్టు ప్రాంతాల్లో కొద్దిపాటి నీళ్లు ఉన్న ప్రదేశాలకు దూరంగా బావులు తవ్వి అక్కడి నుంచి 7–8 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసుకుంటున్నారు.

పంటల కోసం తంటాలు పడుతున్నాం



పంటలు ఎండిపోకుండా నానా తంటాలు పడుతున్నాం. అప్పులు చేసి మరీ పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నాం. నాగార్జునసాగర్ జలాశయం డెడ్ స్టోరేజీకి చేరడంతో బ్యాక్ వాటర్ నుంచి పంటలకు నీటిని అందించేందుకు కిలోమీటర్ల పొడవునా పైప్‌లైన్లు వేస్తున్నాం. – రమావత్ పత్తి, నంబాపురం

మత్తడివాగు మట్టికట్ట తవ్విన రైతులు

తాంసి: రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో ఇప్పటికే వాగులు, చెరువులు నీరు లేక అడుగంటిపోయాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలం మత్తడివాగు ప్రాజెక్టు సైతం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ప్రాజెక్టును నమ్ముకొని కుడికాలువ కింద పంటలు సాగు చేసిన రైతులు ప్రస్తుతం నీరందక ఇబ్బంది పడుతున్నారు. ప్రాజెక్టు నీళ్లలోనే వీరు మోటార్లు ఏర్పాటు చేసుకొని పైపులైన్ ద్వారా పంటలకు నీరు అందించేవారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీరు తగ్గడంతో మోటార్లకు నీరందడం లేదు. కానీ కాలువ వైపు నీరు రాకుండా కాంట్రాక్టర్ గతంలో తాత్కాలికంగా మట్టికట్ట నిర్మించి.. పనులు ముగిసిన అనంతరం తొలగించకుండా వదిలేశాడు. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టి కట్ట నీరు రావడానికి అడ్డంకిగా ఉండటంతో.. రైతులు దానిని తొలగించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పలువురు రైతులు శనివారం తమ మోటార్ల వైపు నీరు వచ్చేలా కట్టను తవ్వేసి నీటిని మళ్లించుకున్నారు. ప్రస్తుతం నీరు అందకపోతే సాగు చేసిన వేరుశనగ, జొన్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఉందని రైతులు పేర్కొన్నారు.



ప్రాజెక్టులో సాగునీటి కోసం కాలువ వైపు తవ్వుతున్న రైతులు

శరీరాలపై నుంచి లారీ వెళ్లడంతో

- దేహాలు ఛిద్రమై.. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం
- బైక్ అదుపుతప్పి రోడ్డుపై చెరో వైపు పడిన భర్త, భార్యాపిల్లలు
- భార్య, ఇద్దరు బాలికలపై దూసుకెళ్లిన లారీ.. అక్కడికక్కడే మృతి
- మృతులు ఏపీ వాసులు.. మందలపల్లి శివారులో ఘటన

దమ్మపేట: లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం మందలపల్లి శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చీమలపాడు గ్రామానికి చెందిన చీపు బాలకృష్ణ తన భార్య లక్ష్మి(23), కుమార్తెలు చరణశ్రీ(8), షణ్మితశ్రీ(6)తో కలసి బైక్‌పై ఖమ్మం జిల్లా వీఎం బంజర నుంచి అశ్వారావుపేట వైపునకు కోళ్లఫారంలో పనికి కుదిరే నిమిత్తం వెళ్తున్నాడు. ఈక్రమంలో మందలపల్లిలోని ప్రభు నర్సరీ సమీపాన లారీని ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా ఎదురుగా మరో వాహనం అడ్డొచ్చింది. ఆ వాహనం సైడ్ మిర్రర్ బైక్‌కు తగలడంతో అదుపు తప్పింది. బాలకృష్ణ ఓ వైపు పడిపోగా మిగిలిన ముగ్గురు కుటుంబ సభ్యులు మరోవైపు పడిపోయారు. ముగ్గురు కుటుంబ సభ్యుల మీదుగా వెనుక నుంచి వస్తోన్న లారీ దూసుకెళ్లడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందారు. లారీ శరీరాల పైనుంచి వెళ్లడంతో ముగ్గురి దేహాలు ఛిద్రం కాగా.. శరీర భాగాలు తెగిపోయి రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. ఇంకో వైపు పడిపోయిన బాలకృష్ణ కాళ్లకు తీవ్రమైన గాయాలు అయ్యాయి. బాలకృష్ణను దమ్మపేట ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. భార్య, ఇద్దరు పిల్లల మృతదేహాలను అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. బాలకృష్ణతో స్థానికులు మాట్లాడి వివరాలు ఆరా తీసే క్రమంలో... తాను ప్రేమ వివాహం చేసుకుని, తల్లిదండ్రులకు దూరంగా జీవిస్తున్నామని చెప్పుకొచ్చిన ఆయన తన భార్యాపిల్లలకు ఏమైందో చెప్పాలని అడగడం స్థానికులకు కలచివేసింది.



లక్ష్మి (ఫైల్)



చరణశ్రీ, షణ్మితశ్రీ (ఫైల్)

ట్యాపింగ్‌పై నివేదిక అడగండి

- సీబీఐ దర్యాప్తు జరిగేలా చూడండి
- గవర్నర్ రాధాకృష్ణన్‌కు బీజేపీ ప్రతినిధి బృందం వినతి

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని కేంద్ర హోంశాఖకు తెలియజేయడంతో పాటు ఈ అంశం ఎన్నికల కమిషన్ పరిధిలోనిది కావ డంతో సీబీఐ ద్వారా సమగ్ర విచారణ జరిపించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. 2014–2023 మధ్య బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలో రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేట్‌వ్యక్తుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేసిన వ్య వహారంపై ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో సాగుతున్న దర్యాప్తునకు సంబంధించిన వివిధ అంశాలను బీజేపీ ప్రతినిధి బృందం గవర్నర్ దృష్టికి తీసుకొచ్చింది. ఈ వ్యవహారంలో వచ్చిన ఆరోపణల తీవ్రత, చోటు చేసుకున్న పరిణామాలను బట్టి చూస్తే దేశభద్రత, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ కు భంగం కలుగుతున్నందున గవర్నర్ జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ రాధాకృష్ణన్‌కు బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఏవీఎస్ రెడ్డి, ఎన్.రామచంద్రరావు, చింతల రామచంద్రా రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎన్వీసుభాష్, కొల్లి మాధవి వినతిపత్రం సమర్పించారు. రాజ్‌భవన్ వద్ద డా.లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎక్కడా లేని విధంగా గతప్రభుత్వం వ్యవహరించిందని మండిపడ్డారు. ట్యాపింగ్ కేసు లో ఇప్పుడు కేవలం పాత్రధారులు మాత్రమే అరెస్ట్ అవుతున్నారని, సూ త్రధారుల సంగతి బయటి రావడం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ ఎంతటి వారైనా విడిచిపెట్టమని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారనీ..కానీ బీఆర్ఎస్ సుప్రీమో పేరు వినిపిస్తున్నా.. ఎవరనేది బయట పెట్టడం లేదన్నారు.



గవర్నర్‌ను కలిసి బయటకు వస్తున్న కె. లక్ష్మణ్, ఎన్.రాంచందర్‌రావు తదితరులు

జిల్లా వార్తలు

రామాలయానికి వెండి పాత్ర బహూకరణ




ఈఓకు వెండి పాత్ర అందజేస్తున్న దాత

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామికి ఏపీకు చెందిన భక్తులు వెండి సామగ్రి విరాళంగా అందజేశారు. విజయవాడ కరెన్సీ నగర్‌కు చెందిన ఎస్.బాలసరస్వతి శనివారం రూ.60వేల విలువైన 658 గ్రాముల వెండి పాత్రను ఆలయ ఈఓ రమాదేవికి అందించారు. ఈ కార్యక్రమంలో స్థానాచార్యులు స్థలశాయి, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి

- టీఎస్ఆర్టీసీ కరీంనగర్ ఈడీ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఈనెల 17, 18 తేదీల్లో జరిగే శ్రీరామనవమి, పట్టాభిషేకం మహోత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యం అందించాలని టీఎస్ఆర్టీసీ కరీంనగర్ ఈడీ సి.వినోద్‌కుమార్ అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఏపీలోని సరిహద్దు జిల్లాల ఆర్టీసీ అధికారులతో శనివారం ఆయన భద్రాచలంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం నేపథ్యంలో రామయ్య కల్యాణానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున రవాణా సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిపో మేనేజర్లు పరస్పరం సమన్వయం చేసుకుంటూ సానుకూల పోటీ దృక్పథం కలిగి ఉండాలన్నారు. సమావేశంలో ఖమ్మం రీజనల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న, అధికారులు భవానీ ప్రసాద్, జీఎస్ పవిత్ర, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల్లో వడదెబ్బ ముప్పు

- దంచి కొడుతున్న ఎండలు, వడగాలులు
- ఎండలోనే డ్రైవర్లు, కండక్టర్ల విధులు
- జాగ్రత్తలపై సూచనలు చేస్తున్న అధికారులు
- ఎక్కువ నీరు తీసుకోవడం ద్వారా సమస్యకు చెక్



బస్ నడుపుతున్న డ్రైవర్

ఖమ్మంమయూరిసెంటర్: వేసవిలో ఎండల తాకిడికి ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే, నీడపట్టున ఉండి పనిచేసే వారికి సమస్య తీవ్రత తక్కువ ఉండగా.. ఆర్టీసీ ఉద్యోగులు మాత్రం భానుడి ప్రతాపాన్ని ఎదుర్కొంటూనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ఉదయం, మధ్యాహ్నం తేడా లేకుండా డ్రైవర్లు, కండక్టర్లు విధులకు హాజరు కావాల్సిందే. ఈమేరకు ఎండ వేడి నుంచి ఉపశమనం కోసం తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చని ఆర్టీసీ అధికారులు సూచనలు చేస్తున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో 742 మంది ఆర్టీసీ డ్రైవర్లు, 883 మంది కండక్టర్లు, 95 మంది మెకానిక్‌లు ఉన్నారు. అలాగే, 350 మంది వరకు అద్దె బస్ డ్రైవర్లు ఉండగా.. వీరి ఆరోగ్యం రీత్యా యాజమాన్యం, వైద్యులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

మండే ఎండల్లో విధులు..

ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు వేసవిలో విధులు నిర్వహించడం కత్తి మీద సాము లాంటిదే. డ్రైవర్ల విషయానికొస్తే నెత్తి మీద సూర్యుడి భగభగ, సీటు వద్ద ఇంజన్ వేడితో నిప్పుల కొలిమిలో ఉన్నట్టే ఉంటుంది. మరోపక్క కండక్టర్ల విధులూ అలాగే ఉంటాయి. ఇలాంటి సమయంలో పలువురు సొమ్మసిల్లిపోవడం, వడదెబ్బకు గురికావడం జరుగుతోంది. వడదెబ్బ తగిలినప్పుడు విపరీతమైన దాహం, శరీరం వేడెక్కిపోవడం, తలనొప్పి, కళ్లు తిరగడం, ఒళ్లు తూలిపోవడం, వాంతులు వస్తున్నట్లు లక్షణాలు కనిపిస్తాయి. రక్తపోటు మామూలు స్థాయి కన్నా పడిపోయి, నాడీవేగంలో మార్పులు చోటు చేసుకుంటాయని వైద్యులు చెబుతున్నారు. అలాగే, జ్వర తీవ్రత 104 డిగ్రీల నుంచి 107 డిగ్రీల మధ్య ఉంటుందని తెలిపారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వారిని చల్లని ప్రదేశానికి చేర్చి గాలి తగిలేలా పటుకోబెట్టి చల్లని నీటితో ముఖం, శరీరంపై చిలకరించాలని సూచిస్తున్నారు. అరచేయి, అరికాళ్లపై చేతులతో రుద్దడం ద్వారా రక్తప్రసరణ మెరుగు పడుతుందని.. ఆతర్వాత సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని విధులు నిర్వర్తిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు వైద్యులు సూచిస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



డ్రైవర్లు, కండక్టర్లు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్నాం. ఏ కొద్ది లక్షణాలు కనిపించినా వెంటనే వైద్యుడిని సంప్రదించాలని, నివారణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నాం. విధులకు వెళ్లే సిబ్బందికి పరీక్షలు చేస్తున్నాం. డ్రైవర్లు, కండక్టర్లకు అందుబాటులో ఉంటూ అవసరమైన చికిత్స అందిస్తున్నాం.

– డాక్టర్ ఏ.వీ.గిరిసింహారావు, మెడికల్ ఆఫీసర్, ఆర్టీసీ రీజనల్, ఖమ్మం

ఎండదెబ్బ నివారణకు..

డ్రైవర్లు, కండక్టర్లు విధులు నిర్వర్తిస్తున్న సమయాన తాగునీరు వెంట తీసుకెళ్లాలి. రోజు మొత్తంలో నాలుగు లీటర్లకు పైగా నీటిని తాగాలి. తద్వారా వడదెబ్బ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. అలాగే, నూనె పదార్థాలు, బయటి ఆహారానికి దూరంగా ఉండాలని.. ఎక్కువగా మజ్జిగ, కొబ్బరినీళ్లు, నిమ్మకాయ రసం, తాజా పండ్ల రసాలు, ఉప్పు, చక్కెర కలిపిన నీరు తీసుకోవాలని సూచిస్తున్నారు. చెమటలు పట్టి, కళ్లు తిరిగే సమయాన లీటర్ నీటిలో నాలుగు స్పూన్ల చక్కెర, అర స్పూన్ ఉప్పు కలిపి తీసుకుంటే ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు.

జమలాపురంలో శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు శ్రీవారి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఏర్పాట్లు చేస్తుండగా వివరాలను శనివారం ఈఓ కె.జగన్మోహన్‌రావు వెల్లడించారు. ఈసమావేశంలో ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొనగా.. ఈఓ మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో తొలి రోజైన 9వ తేదీన శ్రీవారికి పంచామృతాలతో అభిషేకం, చందనాలంకరణ, పంచాంగ శ్రవణం, వేపపూవు ప్రసాదం నివేదన జరిపి యాగశాలలోకి తీర్థపు బిందె తీసుకొస్తామని తెలిపారు. అలాగే, 10వ తేదీన 10న కలశ స్థాపన, 11న ధ్వజారోహణం, 12న శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం, 13న స్వామి, అమ్మవార్ల అలంకారం, 14న ఎదుర్కోలు, 15న మధ్యాహ్నం 12–01 గంటలకు కల్యాణం, 16న శ్రీపుష్పయాగం, 17న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, 18న మహా పూర్ణాహుతి, శ్రీవారికి చక్రస్నానం ఉంటాయని వెల్లడించారు. ఈమేరకు బ్రహ్మోత్సవాలకు హాజరుకానున్న భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు కరపత్రాలను ఆవిష్కరించారు.



జమలాపురంలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ, అర్చకులు

రంజాన్ మాసంలో చివరి అంకం

- చివరి పది రోజులు ఏతేకాఫ్
- పూర్తిగా దైవ ధ్యానానికే కేటాయింపు

చండ్రుగొండ: పవిత్ర రంజాన్‌మాసంలో నిష్టగా ఉపవాస దీక్ష పాటించే ముస్లింలు చివరి పది రోజులు ఏతేకాఫ్ పాటించడం ఆనవాయితీగా వస్తోంది. ఒక మనిషి ప్రాపంచిక వ్యవహారాలను నిలుపుదల చేసుకుని ఏకాంతంగా దైవారాధనలో నిమగ్నమవడాన్ని ఏతేకాఫ్ అంటారు. ఇది విధిగా మసీదులోనే చేయాల్సి ఉంటుంది. దైవం పట్ల ఏకాగ్రతతో ఉంటూ, ఖురాన్ చదవడం, ఇస్లాంలో తెలియని అంశాలను శోధించడంతోపాటు దైవధ్యానంలోనే పరిమితమవుతారు. అత్యంత అవసరమైతే మినహా కుటుంబసభ్యులతో సైతం మాట్లాడవద్దని చెబుతారు. ఇక ఎవరైన డబ్బు ఇచ్చి తన తరఫున ఏతేకాఫ్ కూర్చోబెట్టడాన్ని ఇస్లాంలో నిషేధంగా భావిస్తారు. మహిళలు సైతం మసీదుల్లో ప్రత్యేక వసతులు ఉన్న చోట్ల ఏతేకాఫ్ పాటిస్తారు. రంజాన్ నెలలోని 20వ రోజు సూర్యాస్తమయం నుంచి ఏతేకాఫ్ ప్రారంభమైన ఈద్ – ఉల్ – ఫిత్ర్ పండుగకు ముందు సాయంత్రంతో ముగుస్తుంది. అయితే, పది రోజులు పాటించాల్సి ఉన్నా అవకాశం లేని కొందరు చివరి మూడు రోజులైనా పాటిస్తారు.

అనేక ప్రయోజనాలు...

ఏతేకాఫ్ పాటించడం ద్వారా చెడును పూర్తిగా వదిలిపెట్టి దైవం వైపు లీనమవుతారని మత పెద్దలు చెబుతున్నారు. భార్యాబిడ్డలకు సైతం దూరంగా ఉండి ధ్యానంలో ఉండడంతో దైవానికి దగ్గరవుతారు. రంజాన్ మాసంలోని చివరి పది రోజులను అశ్ర అంటారు. ఈ కాలం మొత్తం ఏకాంతంగా, ఏకాగ్రతతో దైవసన్నిధిలో గడిపే వారిలో మానసిక దృఢత్వం వస్తుందని నమ్ముతారు.



చండ్రుగొండ మసీద్‌లో దైవధ్యానంలో నిమగ్నమైన యువకులు

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

కరకగూడెం: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని భద్రాచలం ఐటీడీఏ ఏటీడీఓ నర్సింహారావు ఉపాధ్యాయులను సూచించారు. కరకగూడెం మండలం చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను శనివారం తనిఖీ చేసిన ఆయన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఆ తర్వాత వంటశాలలను పరిశీలించి మెనూ ఆధారంగా భోజనం అందించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమైన ఏటీడీఓ విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించేలా తర్ఫీదునివ్వడంతో పాటు ఇతర రంగా ల్లోనూ తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఏటీడీఓ నర్సింహారావు

12 ఏళ్ల తర్వాత కుటుంబం చెంతకు..

ఒడిశా వాసిని అప్పగించిన 'అన్నం'

ఖమ్మంఅర్బన్: మతిస్థిమితం కోల్పోయి దారి తప్పి పన్నెండేళ్ల క్రితం వచ్చిన ఒడిశా వాసిని ఆరోగ్యం కుదుటపడడంతో వివరాలు చెప్పగా ఆయనను స్వస్థలానికి తీసుకెళ్లిన ఖమ్మంలోని అన్నం సేవా ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసరావు శనివారం అప్పగించారు. ఖమ్మంలో ఎనిమిదేళ్ల క్రితం మతిస్థిమితం లేని 40ఏళ్ల వ్యక్తి తిరుగుతూ స్థానికులను ఇబ్బంది పెడుతుండగా పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు అప్పగించారు. అప్పటి నుంచి ఆయన ఆశ్రయం కల్పించి బాగోగులు చూడగా ఇటీవలే కోలుకున్న సదరు వ్యక్తి తన పేరు మాన్‌సింగ్ అని, తమది ఒడిశా రాష్ట్రంలోని నౌపడ జిల్లా జాల్‌బహల్ గ్రామమని చెప్పాడు. దీంతో ఇంటర్నెట్ ద్వారా అక్కడి పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ సేకరించిన శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారంతో వారు గ్రామానికి వెళ్లి విచారించగా మాన్‌సింగ్ తమ వాడేనని, 12ఏళ్ల క్రితం మతిస్థిమితం కోల్పోవడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని భార్య చెప్పింది. అయితే, వారు నిరుపేదలు కావడంతో ఖమ్మం రాలేని పరిస్థితి ఉండగా శ్రీనివాసరావు తన సిబ్బందితో సహా ఒడిశాలోని జాల్‌బహల్ వెళ్లి అక్కడి సీఐ గురిందర్ కర్మీ, ఎస్సై అరబిందమెహర్ సమక్షాన మాన్‌సింగ్‌ను కుటుంబానికి అప్పగించారు. ఈసందర్భంగా మాన్‌సింగ్ కుటుంబ పోషణ కోసం రూ.25వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని కూడా అందజేయగా... చనిపోయాడనుకున్న వ్యక్తిని అప్పగించిన శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



పోలీసుల సమక్షాన మాన్‌సింగ్‌ను కుటుంబీకులకు అప్పగిస్తున్న శ్రీనివాసరావు